క్లుప్తంగా

బాలికలకు కంటి పరీక్షలు



విద్యార్థినులకు నాప్‌కిన్స్ అందిస్తున్న దృశ్యం

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెం ఉన్నత పాఠశాలలో సోమవారం అఖిల కంటి ఆస్పత్రి ఆధ్వర్యాన బాలికలకు రామానుజరావు శానిటరీ నాప్‌కిన్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం చేపట్టి కంటి పరీక్షలు నిర్వహించగా.. కంటి సమస్యలు ఉన్న తొమ్మిది మందిని ఆస్పత్రికి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ చోరీ

కామేపల్లి: మండలంలోని నెమలిపురికి చెందిన రైతు సరికొండ సతీష్ వ్యవసాయ బావి వద్ద అమర్చిన విద్యుత్ మోటర్ చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి మోటార్‌ను ఎత్తుకెళ్లగా సోమవారం గుర్తించిన రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

'నర్మదా' పుష్కరాల జలం పంపిణీ

ఖమ్మం మామిళ్లగూడెం: నర్మాదా నది పుష్కరాల సందర్భంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్ ఆధ్వర్యాన సోమవారం 37వ డివిజన్‌లో ఇంటింటికీ పుష్కర జలాలను అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గడ్డం అశోక్‌గౌడ్, ఆకుల మురళి, పొట్టి ముత్తి జనార్దన్, సూరివిష్ణు, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు..

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్‌లో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను సోమవారం 8వ డివిజన్ కార్పొరేటర్ లకావత్ సైదులు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బండి నాగేశ్వరావు ఎం. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి యూనిట్లు ప్రారంభం

రఘునాథపాలెం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని వీవీపాలెంలో రెండు యూనిట్లను ప్రారంభించారు. కృష్ణవేణి, వెన్నెల గ్రూప్‌లో జిరాక్స్ అండ్ స్టేషనరీ షాప్‌ను జగ్యాతండాలో భూక్యా దివ్య, శ్రీకృష్ణ గ్రూప్‌లో డీజే సౌండ్ సిస్టమ్ యూనిట్లను గ్రామ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం మండలం ఏపీఎం శారదా, అధ్యక్షులు గౌరమ్మ, అనిత, సీసీలు ఈ.భిక్షమయ్య, జ్యోతి, వెంకటేశ్వరావు, అనురాధ, వసంత, టి. సావిత్రి, జై.సుభద్ర, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు

ఖమ్మంరూరల్: విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్‌ఎఫ్ నిరంతర పోరాటాలు చేస్తుందని ఏఐఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి బి.మనోజ్ అన్నారు. సోమవారం మండలంలోని జలగంనగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాస్త్రీయ విద్యా విధానం అమలు, విద్య కాషాయీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నేటి నుంచి సంఘం 89వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు అన్ని పాఠశాలల వద్ద సమావేశాలు నిర్వహిస్తూ సంఘం లక్ష్యాలు, సిద్ధాంతాలను వివరించనున్నట్లు తెలిపారు. సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కల్కి
వినోద	శివం భజే
సాయిరాం	తుఫాన్, సూపర్ డీలక్స్
ఆదిత్య	కమిటీ కుర్రోళ్లు, సీఎస్ సినీ గెలాక్సీ : సంబా
శ్రీనివాస	రాయన్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	36	బచ్చలికూర	4
వంకాయ	46		20
బెండకాయ	24	పాలకూర	3
పచ్చిమిర్చి	54		20
కాకర	46	చుక్కకూర	3
బోడ కాకర	180		20
బీర	40	తోటకూర	3
దొండ	32		20
పొట్లకాయ	40	గోంగూర	5
చిక్కుడు	46		20
గోరుచిక్కుడు	40	మెంతికూర	2
క్యాబేజీ	26		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	36		25
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	40		25
క్యాప్సికం	66	-ఖమ్మం వ్యవసాయం	

ప్రజా సేవే లక్ష్యంగా పనిచేయాలి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన అదనపు కలెక్టర్, ఇతర శాఖల అధికారులు

ఖమ్మంరూరల్: ప్రజా సేవే లక్ష్యంగా.. నిద్ర లేచింది మొదలు గ్రామ కార్యదర్శులు, ఏఈఓలు ఏ గ్రామంలో పని చేస్తున్నారో అదే గ్రామంలో నివాసం ఉండి పని చేయాలని, వ్యవసాయశాఖ ఏఈలు సైతం వారి క్లస్టర్ పరిధిలోనే నివాసం ఉండి రైతులకు సలహాలు, సూచనలు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివారెడ్డి ఆదేశించారు. సోమవారం మండలంలోని సత్యనారాయణపురంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ వ్యవసాయ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, సిబ్బందితో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత నియోజకవర్గంలోని మేజర్ గ్రామపంచాతీలకు చెందిన కార్యదర్శుల నుంచి ఆయా గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పాలేరు నియోజకవర్గంలో పని చేస్తున్న గ్రామ కార్యదర్శులపై ఫిర్యాదులు అందాయని ఇది మొదటి తప్పుగా భావించి మందలించి వదిలేస్తున్నట్లు తెలిపారు. మరలా పునరావృతం అయితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ జీపీలో డైనమిక్‌గా పని చేసే కార్యదర్శులను నియమించాలని, దీనిలో భాగంగా మండలంలోని పెదతండా లాంటి మేజర్ గ్రామపంచాయతీకి అవసరాన్ని బట్టి మరో గ్రామ కార్యదర్శిని కూడా నియమించాలని సూచించారు. ఏడాది లోపు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీల సమస్య తీరుతుందని, అత్యవసరమైన పనులను తన దృష్టికి తెస్తే తక్షణమే వారి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ప్రజలను ఇబ్బంది పెడితే సహించం..

పాఠశాలలకు 200 మీటర్ల లోపు మద్యం దుకాణాలకు అనుమతి ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ సిబ్బంది పని చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదన్నారు. అనర్హులకు పింఛన్లు ఇవ్వొద్దని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ గ్రామంలోనూ తన సొంత ఖర్చుతో ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయిస్తానన్నారు. రైతు రుణమాఫీ అందని వారి జాబితాను రూపొందించాలని, పామాయిల్ సాగు, ఖరీఫ్ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. రైతు వేదికల వద్ద రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డీఈఓ సోమశేఖరశర్మ, డీఏఓ విజయ నిర్మల, నాలుగు మండలా ఏఓలు, ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు..

మండలంలోని తల్లంపాడు నుంచి పైనంపల్లి వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులకు, ఆరేకోడు, ఆరేకోడుతండాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రి శ్రీనివాసరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కళ్లెం వెంకటరెడ్డి, మద్ది వీరారెడ్డి, మల్లారెడ్డి, బండి సగదీష్, ధరావత్ రాంమూర్తినాయక్, కుమ్మరి అంబేద్కర్, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటిపై జాతీయ జెండా ఎగరాలి



ఖమ్మం మామిళ్లగూడెం: జాతీయ జెండాను చూపిస్తూ మాట్లాడుతున్న గల్లా సత్యనారాయణ

నేలకొండపల్లి/ఖమ్మంమామిళ్లగూడెం: హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, రాష్ట్ర నాయకుడు డాక్టర్ గొంగూర వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం నేలకొండపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో కిరణ్, ఖమ్మంలోని శ్రీరక్ష ఆస్పత్రి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సత్యనారాయణ, వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ నెల 13 నుంచి 15 వరకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ప్రతీ ఇంటిపై జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. నేలకొండపల్లి కార్యక్రమంలో హర్‌ఘర్ తిరంగా కన్వీనర్ శ్యాంసుందర్ నాయక్, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, చావా కిరణ్, వైద్యులు ఏడుకొండలు తదితరులు పాల్గొనగా, ఖమ్మంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు పాగర్తి సుధాకర్, సూరుపల్లి జ్ఞానరత్నం, సయ్యద్ మోహినుద్దీన్, పిట్టల సూరిబాబు, జడ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, నేలకొండపల్లి మండలంలోని బోదులబండ గ్రామంలో మండల ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్ ఆధ్వర్యాన మహాత్మ గాంధీ విగ్రహాన్ని శుభ్రం చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానరత్నం, సయ్యద్ మోహినుద్దీన్, మల్లేష్, కాసాని ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

సుభాస్ చంద్రబోస్‌కు నివాళి

ఖమ్మం మామిళ్లగూడెం: సుభాస్ చంద్రబోస్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సన్నె ఉదయ్‌ప్రతాప్ పిలుపునిచ్చారు. హర్‌ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా జాతీయ పార్టీ ఆదేశానుసారం నగరంలోని త్రీటౌన్, వన్‌టౌన్‌లోని సుభాస్ చంద్రబోస్ విగ్రహాలను శుభ్రపరిచి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ త్రీటౌన్ అధ్యక్షుడు కొణతం లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోశాధికారి దోకుపర్తి రవీంద్రకుమార్, జ్వాలా నర్సింహారావు, సాయిరాం, అనిత, రాహుల్‌నాయక్, ఆర్‌వీఎస్ యాదవ్, వాసు, మృత్యుంజయరావు, జంగిలి రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి గ్రీవెన్స్‌కు 19 మంది వివిధ సమస్యలపై ఫిర్యాదులు చేశారు. వీటిలో రెవెన్యూ 12, మండల పరిషత్- 4, వ్యవసాయశాఖ- 2, ఐసీడీఎస్-1 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీవీ రామకృష్ణ, ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేఎంసీ గ్రీవెన్స్‌కు 19 ఫిర్యాదులు..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 19 ఫిర్యాదులు వచ్చాయి. ఆర్‌ఓ, మేనేజర్ జి.శ్రీనివాస్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించగా.. వీటిలో ప్రధానంగా రెవెన్యూ విభాగానికి సంబంధించి పేరు మార్పు, ఇంటి నంబర్లు, పన్నుల సవరణ, టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి పలు ఫిర్యాదులు వచ్చాయి. అనంతరం అందిన దరఖాస్తులను ఆర్‌ఓ ఆయా విభాగాల అధికారులకు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం/ఖమ్మంఅర్బన్: నగరంలోని ప్రశాంతినగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-3, బల్లేపల్లి విద్యుత్ శాఖ ఏఈలు సోమవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. దీంతో ప్రశాంతినగర్, యూపీహెచ్ కాలనీ, బాలాజీనగర్, బ్యాంక్ కాలనీ, వేణుగోపాల్ నగర్, ఎన్టీఆర్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈలు కోరారు.

నేడు చిరు ధాన్యాల సాగుపై అవగాహన

రఘునాథపాలెం: రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా నేడు(మంగళవారం) ఉదయం 10 గంటలకు వీవీపాలెం రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమం ఉంటుందని మండల ఏఓ బాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో మొక్కజొన్న, చిరుధాన్యాల సాగులో యాజమాన్య పద్ధతులు, పురుగు మందుల అవశేషాల యాజమాన్య పద్ధతులు అనే అంశాలపై అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. కావున రైతులు సకాలంలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కోరారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి

కూసుమంచి: విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంచాలని కూసుమంచి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, మండల నోడల్ అధికారి రాయల వీరస్వామి అన్నారు. సోమవారం కూసుమంచి హైస్కూల్‌లో కూసుమంచి, నేలకొండపల్లి మండలాలకు చెందిన ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్) శిక్షణలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా బోధన ఉండాలని, నాస్ పరీక్షలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేలా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రిసోర్స్ పర్సన్‌లు పలు అంశాలను శిక్షణలో పాల్గొన్న వారికి వివరించారు.

ప్రతీ గ్రామానికి తపాలా సేవలు

ఖమ్మంగాంధీచౌక్: ప్రతీ గ్రామానికి తపాలా సేవలను విస్తృత పర్చుతున్నట్లు ఆ శాఖ సౌత్ సబ్ డివిజన్ ఐపీఓ కె.గోపీనాథ్, మెయిల్ ఓవర్సీ(ఎంఓ) పెరుగు నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ సబ్ ఆఫీస్, బల్లేపల్లి బ్రాంచ్ ఆఫీస్‌లలో డీసీడీపీ(డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం)పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తపాలా శాఖ పీఓఎస్‌బీ, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ తదితర సేవలను అందిస్తుందని వివరించారు. ఈ కార్యక్రజుమంలో తపాలా ఉద్యోగులు, ఎం.లక్ష్మణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథ పాలకుల దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పద్మావతి

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం గ్రంథ పాలకుల దినోత్సవాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయ విభాగంలో విశిష్ట సేవలందించిన రామామృత రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రంగనాథన్ సేవలు కొనియాడారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ మల్లేశం, సీనియర్ అధ్యాపకులు రామకుమార స్వామి, వెంకటేశ్వరరావు, ప్రవీణ్, రామారావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథ పాలకురాలికి ఉత్తమ అవార్డు..

కామేపల్లి: కామేపల్లి గ్రంథ పాలకురాలు లలితకుమారి ఉత్తమ అవార్డు అందుకుంది. సోమవారం హైదరాబాద్‌లో కేంద్ర గ్రంథాలయంలో ఉత్తమ గ్రంథ పాలకుల దినోత్సవం నిర్వహించగా.. లలితకుమారి ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు గానూ గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ రియాజ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

కామేపల్లి: మండలంలోని కొత్తలింగాల శ్రీ కోటమైసమ్మతల్లి దేవాలయ హుండీని దేవాదాయశాఖ ఖమ్మం విభాగం పరిశీలకులు అనిల్‌కుమార్ ఆధ్వర్యాన లెక్కింపు చేపట్టగా.. రూ.30843 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహణాధికారి నల్లమోతు శేషయ్య, జూనియర్ అసిస్టెంట్ బడాటి వరప్రసాద్, బాచిమంచి పుల్లయ్య, సత్యమయ్య తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ పంపిణీకి చర్యలు

ఖమ్మంవ్యవసాయం: మెరుగైన విద్యుత్ పంపిణీకి పటిష్ట చర్యలు తీసుకున్నట్లు ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఆపరేషన్స్ ఎస్ఈ ఎ.సురేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం గడిచిన 8 నెలల కాలంలో లోడ్ పెరిగే అవకాశం ఉన్న వివిధ సబ్ స్టేషన్లలో సామర్థ్యాలను పెంచుతూ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం, లూజ్‌గా ఉన్న పోల్స్ సరిచేయడం, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తు పెంచడం, నూతన లైన్ల వేయడం వంటి పనులు చేసినట్లు పేర్కొన్నారు.

జూనియర్ డాక్టర్ మృతికి సంతాపం

ఖమ్మంవైద్యవిభాగం: కోల్‌కత్తాలో జూనియర్ పీజీ వైద్యురాలిపై హత్యాచారం చేసి, హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల వైద్యులు డిమాండ్ చేశారు. సోమవారం పెద్దాస్పత్రిలోని సూపరింటెండెంట్ చాంబర్‌లో ఆమె మృతికి సంతాపం తెలిపి మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, ఆర్‌ఎంఓలు డాక్టర్ కళావతిబాయి, రాంబాబు, రాథోడ్ వినాయక్, ఎంసీహెచ్ సూపరింటెండెంట్ బాబు రత్నాకర్ పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండ గ్రామానికి చెందిన పి.ధనమూర్తి(30) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. ధనమూర్తి గత రెండు రోజులుగా అస్వస్థతకు గురికాగా సోమవారం ఇంట్లో ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు. మృతుడికు భార్య, కుమార్తె, కుమారుడు ఉండగా.. మృతదేహాన్ని వివిధ పార్టీల నాయకులు, తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

రైతులు విద్యుత్ భద్రతలు పాటించాలి



రైతులకు సూచనలు చేస్తున్న అధికారులు

కామేపల్లి: విద్యుత్ వినియోగదారులు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా, విద్యుత్ భద్రతలను పాటించాలని విద్యుత్‌శాఖ ఖమ్మం డివిజన్ ఇంజనీర్ రామారావు అన్నారు. సోమవారం మండలంలోని బర్లగూడెంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యాన పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. కెపాసిటర్లు అమర్చడం వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. ఎటువంటి అనుమతి లేకుండా విద్యుత్‌ను వినియోగిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వైవీ ఆనంద్, ఏఈ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

జన జాగరణను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మిక, కర్షకులకు జరిగిన అన్యాయాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నెల 14న జన జాగరణను చేపట్టినట్లు వ్యవసాయ కార్మిక, కార్మిక సంఘాల నేతలు పేర్కొన్నారు. నగరంలోని పాత బస్టాండ్ వద్ద జరిగే ఈ కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలకు నిరసన తెలపాలన్నారు. సోమవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు అధ్యక్షతన కార్మిక సంఘాల నేతల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు కొండపర్తి గోవిందరావు, మాదినేని రమేష్, ఆవుల వెంకటేశ్వర్లు, కార్మిక సంఘాల నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, జి.రామయ్య, నరాల నరేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. ఇక కార్మిక చట్టాలను కోడ్‌ల పేరుతో రద్దు చేసే కుట్రలు చేస్తుందని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. జన జాగరణలో కార్మికులు, మేధావులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు పగిడిపల్లి ఏసు, మెరుగు సత్యనారాయణ, తిమ్మిడి హనుమంతరావు, గాదె లక్ష్మీనారాయణ, పి.మోహన్‌రావు, ఎండీ జాకిరుద్దీన్, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ సాయి ఆశ్రమానికి అవార్డు



రామారావును సత్కరిస్తున్న నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: సామాజిక సేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న నగరంలోని హర్కారా బావి రోడ్‌లో రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీ కృష్ణ సాయి ఆశ్రమ చైర్మన్ లగడపాటి రామారావుకు హైదరాబాద్ లలిత కళా సమాఖ్య సంస్థ, రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం స్వాతంత్ర్య దినోత్సవ సువర్ణ కంకణ అవార్డును అందించి సత్కరించింది. హైదరాబాద్‌లోని ఓ కళాభవన్‌లో ఆదివారం రాత్రి లలిత కళా సమాఖ్య, రుద్రాక్ష వైభవం ప్రతినిధులు, నిర్వాహకులు శ్రీకృష్ణ చాముండేశ్వర మహర్షి, ఎం.మనోరంజని, ఎం.వెంకటేశ్వరరావు, గౌరి సుజాత, తదితరులు ఆయనకు అవార్డు ప్రదానం చేశారు.

స్తంభాద్రి ఆలయంలో కుంభాభిషేకం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో 17వ వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం విశేష పూజలు, పవిత్ర విసర్జన, మహా కుంభాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలతో స్వామి వారి శాంతి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి కొత్తూరి జగన్మోహన్‌రావు పర్యవేక్షణలో అర్చకులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మాజీ ఉపరాష్ట్రపతిని కలిసిన బీజేపీ నేతలు

ఖమ్మం మామిళ్లగూడెం: ఏపీలోని విజయవాడలో సోమవారం జరిగిన మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు ఆత్మీయ సమ్మేళనంలో బీజేపీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవి, రాష్ట్ర నాయకులు గెంటెల విద్యాసాగర్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అందజేస్తున్న దృశ్యం

కూసుమంచి: ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు గ్రామానికి చెందిన గూడా బాలకృష్ణ తన సెల్‌ఫోన్‌ను మూడు నెలల క్రితం పోగొట్టుకోగా జూన్‌లో కూసుమంచి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పోలీసులు అట్టి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని సోమవారం పోలీస్‌స్టేషన్‌లో బాధితుడికి ఏఎస్సై కృష్ణప్రసాద్, టెక్ టీం ఆపరేటర్ తేజావత్ రమేష్ అందజేశారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా మార్జిన్..!



ఖమ్మం ఇల్లెందు ప్రధాన రోడ్డులో..

ఖమ్మం-ఇల్లెందు ప్రధాన రహదారిలో వాహనదారులు రోడ్డు మార్జిన్ దిగాలంటే భయపడుతున్నారు. రోడ్డు అంచును ఆనుకొని గడ్డి పెరగడంతో ఎదురుగా వాహనాలు ఎదురైతే రోడ్డు దిగడానికి వీలు లేకుండా ఉంది. రోడ్డు దిగితే ఎక్కడ లోయలు, గుంతలు ఉండి ప్రమాదాలు చోటు చేసుకుంటాయోనని ఆందోళన చెందుతున్నారు. శివాయిగూడెం పెంకు ఫ్యాక్టరీ టర్నింగ్ నుంచి పెట్రోల్ బంకు వరకు, అలాగే మంచుకొండ బైపాస్ నుంచి బూడిదంపాడు బంకు వరకు ప్రమాదకరంగా ఉంది. ఇప్పటికైనా ఎటువంటి ప్రమాదాలు జరగకముందే ఆర్అండ్‌బీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

- రఘునాథపాలెం

వయనాడ్ బాధితుల కోసం విరాళాలు



ఖమ్మంమయూరిసెంటర్: విరాళం అందిస్తున్న కార్పొరేటర్ చంద్రకళ

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంరూరల్: కేరళలోని వయనాడ్ వరద బాధితుల కోసం ఖమ్మంలో విరాళాలు సేకరిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో వేర్వేరుగా విరాళాలను సేకరించారు. బోడేపూడి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రూ.10 వేలు, కార్పొరేటర్ గోళ్ల చంద్రకళ రూ.5 వేలు ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో జమ్ముల జితేందర్‌రెడ్డి, శింగు నర్సింహారావు, పోటు కళావతి, రావి శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు, ఏనుగు గాంధీ, యర్రా శ్రీకాంత్, వై.శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు, ఎస్‌కె అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు. కాగా, సీపీఎం ఆధ్వర్యంలో ఖమ్మంరూరల్ మండలంలోని తల్లంపాడులో విరాళాల సేకరణ చేపట్టగా గ్రామవాసి బి.వెంకటేశ్వరరావు రూ.10 వేలు ఇచ్చారు. అలాగే, గ్రామ పర్యటనకు వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సీపీఎం నాయకులు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందించారు.